

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పేజీలు : 4 | సంపుటి : 01 | సంచిక 234 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | బుధవారం 04 -12-2024 | వెల - 2 | Digital Edition



L.K.R COLLEGE OF NURSING
(Affiliated to Dr. N.T.R U.H.S Vijayawada)
Near J.V.R.R. ITI, V.C. Colony, Nandyal - 518502
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సం॥ల B.Sc., నర్సింగ్ కోర్స్,
అర్హత: ఇంటర్ Bi.P.C., మరియు ఒకేషనల్ నర్సింగ్ పాస్ అయిన విద్యార్థినీ, విద్యార్థులు EAPCET అర్హత సాధించిన వారు అర్హులు.
(మేనేజ్‌మెంట్ కోటా నందు కొన్ని సీట్లు కలవు)
పూర్తి వివరములకు: 85200 10739, 85200 23866
జె.లక్ష్మీకాంత రెడ్డి, ఛైర్మన్


### ఏపీని వెంటాడుతున్న మరో...

# అల్పపీడనం...

**డిసెంబర్ 9 నుంచి 16వ తేదీ మధ్య అల్పపీడనం ఏర్పడే ఛాన్స్**
**దక్షిణ కోస్తా జిల్లాలపై ప్రభావం ఎక్కువని ఐఎండీ అంచనా**
**ఫెయింజల్ తుఫాన్ తీరం దాటినా ఆగని వర్షాలు**

అమరావతి : ఫెయింజల్ తుఫాన్ తీరం దాటినా దాని ప్రభావం మాత్రం ఆంధ్రప్రదేశ్ పై కొనసాగుతూనే ఉంది. శనివారం సాయంత్రం తుఫాన్ తీరం దాటింది. అయితే, రాష్ట్రంలో మంగళవారం కూడా పలుచోట్ల వర్షం కురిసింది. ఒంగోలు, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో వర్షం బీభత్సం

మిగతా 2 లో



### అమరావతి పనులకు...

# మళ్లీ టెండర్లు..: మంత్రి

**అమరావతిలో ఆగిన పనులపై ఇంజినీర్లతో కమిటీ వేశామన్న మంత్రి నారాయణ**
**కమిటీ నివేదిక మేరకు పాత టెండర్లు రద్దు చేస్తున్నట్లు వెల్లడి**
**డిసెంబరు చివరి నాటికి కొత్త టెండర్లు పిలుస్తామని వివరణ**
**జనవరి నుంచి పనులు ప్రారంభం!**
**మూడేళ్లలో అమరావతి పూర్తయ్యేలా కార్యాచరణ**

అమరావతి, ప్రజారిపబ్లిక్ న్యూస్ : ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. అమరావతి పనులకు మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అమరావతిలో ఆగిన పనులపై ఇంజినీర్లతో కమిటీ వేశామని చెప్పారు. కమిటీ నివేదిక మేరకు టెండర్లు రద్దు చేసి, మళ్లీ

మిగతా 2 లో



### ఢిల్లీకి రావాలంటేనే విసుగు...

# కలుగుతోంది!

**: నితిన్ గడ్కరీ**



ఢిల్లీ, ప్రజారిపబ్లిక్ న్యూస్ : దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యస్థాయి తీవ్రంగా పెరుగుతుండటంతో ఇక్కడకు రావాలంటేనే విసుగు కలుగుతోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తనకు ఢిల్లీలో నివసించడం ఏమాత్రం ఇష్టం ఉండదన్నారు. కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుండటంతో తనకు ఢిల్లీకి రావాలనిపించడం లేదన్నారు. ఢిల్లీలో కాలుష్యం బాగా ఉందన్నారు. తాను ఢిల్లీకి వచ్చే ప్రతిసారీ కాలుష్యం భయంతో వెళ్లాలా? వద్దా? అని ఆలోచిస్తుంటానన్నారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడమే కాలుష్య నివారణకు ఉత్తమ మార్గమన్నారు. మన దేశం

మిగతా 2 లో

### వివిధ ప్రభుత్వ పాలసీలకు...

# మంత్రివర్గం ఆమోదం

**ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం... వివరాలు ఇవిగో!**
**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం**
**జల్ జీవన్ మిషన్ ఆలస్యం కావడంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి**

అమరావతి, ప్రజారిపబ్లిక్ న్యూస్ : సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశం ముగిసింది. పలు రంగాల్లో ప్రభుత్వ విధానాలకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఏపీ మారిటైమ్ పాలసీ, టెక్స్ టైల్స్ గార్మెంట్ పాలసీ, ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ (4.0)లకు రాష్ట్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. అంతేకాదు... పులివెందుల, ఉద్ధానం, డోన్ తాగునీటి ప్రాజెక్టులను క్యాబినెట్ ఆమోదించింది. హోమియోపతి, ఆయుర్వేద ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు కూడా నేటి సమావేశంలో ఆమోదం లభించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గిరిజన గృహ పథకం అమలు, ఇంటిగ్రేటెడ్ టూరిజం పాలసీ, క్రీడా విధానంలో మార్పులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ భేటీలో

మిగతా 2 లో



### కొత్త న్యాయ చట్టాల అమలు...

# జాతికి అంకితం

**: ప్రధాని మోదీ**



చండీఘడ్, ప్రజారిపబ్లిక్ న్యూస్ : నూతనంగా తీసుకువచ్చిన మూడు నేర చట్టాలను జాతికి అంకితం చేశారు ప్రధాని మోదీ. ఇవాళ చండీఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్ చట్టాలను జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ అండ్ ద ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు చట్టాలను ఇటీవల కేంద్ర సర్కారు రద్దు చేసింది. కొత్త మూడు న్యాయ చట్టాలను వంద శాతం అమలు చేసిన నగరంగా చండీఘడ్ నిలిచింది. ఈ నేపథ్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలు, ప్రాముఖ్యతకు లోటు రాకుండా భారతీయ న్యాయ సంహిత రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆశయాల దిశగా అడుగులు వేసేందుకు కొత్త క్రిమినల్ చట్టాలను

మిగతా 2 లో

### తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన...

# శ్రీకాంతాచారి ప్రాణత్యాగం

**: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, ప్రజారిపబ్లిక్ న్యూస్ : శ్రీకాంతాచారి అమరత్వం గొప్పదని, ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమన కాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యారని చెప్పారు. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిందన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు. 'శ్రీకాంతాచారి అమరత్వం గొప్పది. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరు. తెలంగాణ

మిగతా 2 లో

## బీజేపీ నిర్ణయంతో షిండే కలత చెందారు..

### ఆయన ముందున్న మార్గం ఇదే : రామ్‌దాస్ అథవాలే

న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. ఫలితాలు వెలువడి పది రోజులైనా ఇప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కూటమిలోని బీజేపీకి అత్యధిక స్థానాలు రావడంతో సీఎం పదవి తనవద్దే ఉంచుకోవాలని చూస్తోంది. అయితే, ఏక్‌నాథ్ షిండే అందుకు అంగీకరించడం లేదు. బీజేపీ నిర్ణయంతో ఆయన తీవ్ర కలత చెందారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా చీఫ్, కేంద్ర


మిగతా 2 లో



## తాజ్ మహల్‌కు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీసులు

న్యూఢిల్లీ, ప్రజారిపబ్లిక్ న్యూస్ : తాజ్ మహల్‌ను బాంబులతో పేల్చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరించి. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాజ్ మహల్ వద్దకు బాంబ్ డిస్పోజల్ టీమ్‌లను, డాగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. తాజ్ మహల్‌ను పేల్చివేస్తామని బెదిరింపు ఇ-మెయిల్ వచ్చిందని ఆగ్రా డీసీపీ సూరజ్ రాయ్ తెలిపారు. ప్రస్తుతం పర్యాటకులను బయటకు పంపి.. పోలీసు బలగాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే, ఇ-మెయిల్ ఎవరు పంపారు? ఎక్కడి నుంచి వచ్చిందనే విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు తాజ్ మహల్ వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులను గుర్తించలేదని

మిగతా 2 లో



### మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ పోలీసులు...

# ఎందుకు పాల్గొన్నారు..

**సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన సీపీఐ**

హైదరాబాద్, ప్రజారిపబ్లిక్ న్యూస్ : ములుగు జిల్లా చల్పాక సమీపంలో మావోయిస్టులపై జరిగింది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆ ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం వెంటనే జుడీషియల్ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాల యం మఖ్దూంభవన్‌లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రశ్నించే వాళ్లకు బతికే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. 2026 నాటికి మావోయిస్టులను తుడిచిపెడతామని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించడంలోని అర్థ

మిగతా 2 లో



### బియ్యం అక్రమ రవాణాలో నా వియ్యంకుడికి...

# సంబంధం లేదు..

**వైసీపీ నేతలకు ఏపీ మంత్రి పయ్యావుల కౌంటర్**

అమరావతి, ప్రజారిపబ్లిక్ న్యూస్ : కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణాపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన తనిఖీలు ఏపీలో రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వైసీపీ నేతల బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని కూటమి నేతలు ఆరోపిస్తుంటే.. ఆర్థిక మంత్రి వియ్యంకుడే రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఇలా

మిగతా 2 లో




# సంపాదకీయం

## కాశీ, మధురతో సరిపుచ్చేస్తారా....

ప్రస్తుతంతో పోల్చుకుంటే గతం చాలా భయంకరంగా ఉందనేది నిజం. ఇప్పుడు రాజులు, రాజ్యాలు పోయాయి. ప్రపంచాన్ని కుదించేసి, ప్రజాస్వామ్యం పరుగులు పెడుతోంది. ప్రపంచాన్ని ఏలిన బ్రిటన్, అమెరికా లాంటి దేశాలను కూడా పాలించే స్థాయికి భారతీయులు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాబ్రీ మసీదు ఉన్న స్థలంలో రామమందిరాన్ని నిర్మించిన తర్వాత.. కాశీ, మధురలోని మరో రెండు ఆలయాలను శాంతియుతంగా విముక్తి చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద్ దేవ్ గిరి మహారాజ్‌తో పాటు చాలా మంది హిందూ వాదులు అన్నారు. ఆ సందర్భంగానే గోవింద్ దేవ్ గిరి మాట్లాడుతూ.. కాశీ, మధుర దేవాలయాలను శాంతియుతంగా విముక్తి చేసిన వెంటనే, విదేశీ ఆక్రమణదారులు ధ్వంసం చేసిన దేవాలయాలను హిందూ సమాజం మరచిపోతుందని స్పష్టం చేశారు. దాదాపు 3 వేల 500 దేవాలయాలు విదేశీ దాడుల్లో నేలమట్టం అయ్యాయనీ.. అయినప్పటికీ, ఈ మూడు దేవాలయాలు శాంతియుతంగా కలిసిపోయిన తర్వాత, ఏ ఇతర దేవాలయాల వైపు చూడమని హామీ ఇచ్చారు. "మనం గతంలో కాదు, భవిష్యత్తులో జీవించాలి" అని కూడా గోవింద్ దేవ్ గిరి వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గోవింద్ దేవ్ గిరి మహారాజ్ మాట్లాడుతూ.. నా దేశం మారిపోయిందని అన్నారు. "గతం అంతా మరచిపోతాం" అని కూడా అన్నారు. కాశీ, మధురలోని దేవాలయాలను హిందువులకు అప్పగించాలని కూడా ఆయన ముస్లిం సమాజాన్ని కోరారు. వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదుకు సంబంధించిన సర్వే నివేదికలో.. పురాతన హిందూ దేవాలయ అవశేషాలపై మసీదు నిర్మించారని భారత పురావస్తు శాఖ రిపోర్ట్ ఇచ్చిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. అయితే, ఇటీవల లోక్‌సభ ఎన్నికల నుండీ దీనికి విరుద్ధంగా బిజెపి నేతల వ్యాఖ్యలు చేస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ అయితే దాదాపు అన్ని వేదికలపై దేవాలయాల పున:స్థాపన నినాదాన్ని ఎత్తుకుంటున్నారు. ఇటీవలి మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల సందర్భంలోనే ఇదే అంశాన్ని లేవనెత్తారు. ఈ క్రమంలోనే, ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్‌లో షాహీ జామా మసీదు విషయంలో స్థానిక కోర్టు సర్వేకు అనుమతి ఇచ్చింది. అది అక్కడ మత వివాదానికి దారి తీసింది. ఈ తాజా వివాదం గురించి రాజ్యసభ ఎంపీ, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడైన కపిల్ సిబల్ కూడా ఘాటుగా స్పందించారు. ఈ దేశం ఎటు వెళ్తుంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ విభజనను సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయనీ.. దేశాన్ని ఎటు తీసుకెళు న్నామో అర్థమవుతుందా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి విభజన రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు. నిజానికి, ఇలాంటి ప్రశ్నలు సామాన్యుల నుండీ మేథావుల వరకూ చాలా మంది మెదడును తొలిచేస్తున్న ప్రశ్నలే. అందులోనూ, అజ్మీర్ దర్గాను భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండీ ఇప్పటి ప్రధాని నరేంద్ర మోడీ వరకూ అందరూ గౌరవించే వారే. ఆ దర్గాకు దేశ ప్రధానమంత్రి హోదాలో మోడీ కూడా చాదర్‌ను పంపించారు. అలాంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న కట్టడం విషయంలో వివాదాన్ని సృష్టించడం, దాని నుండి రాజకీయ లబ్ధిని పొందడం అనేది ఆందోళన కలిగించే విషయం అన్నది చాలా మంది చెబుతున్న మాట. ఎవరి పేరుతో అయితే ఈ దర్గా ఉందో.. ఈ మొయినుద్దీన్ చిస్తీ 13వ శతాబ్దానికి చెందిన సూఫీ సన్యాసి, తత్వవేత్త. మొయినుద్దీన్ మరణించిన తర్వాత ఆయన్ను గొప్ప సాధువుగా అందరూ పరిగణించారు. ముయిన్ అల్-దీన్ దర్గాను 1236 మార్చిలో నిర్మించారు. ఇది తర్వాత శతాబ్దంలో అత్యంత గౌరవనీయమైన ప్రదేశంగా మారింది. అప్పటి నుండీ అన్ని సామాజిక వర్గాలు దీన్ని గౌరవిస్తూ వచ్చారు. ఈ సమాధిని ఈ యుగంలోని అత్యంత ముఖ్యమైన సున్నీ పాలకుల గౌరవంగా చూసుకున్నారు. మొఘల్ చక్రవర్తి అక్బర్ తన పాలనా కాలంలో పద్నాలుగు సార్లు ఈ దర్గాను సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. 1566లో తన హిందూ భార్య మరియం-ఉజ్-జమానీతో కలిసి, వారికి బిడ్డలు పుట్టాలనే ఆశతో.. చెప్పులు లేకుండా ఈ సమాధికి తీర్థయాత్ర చేసినట్లు తెలుస్తోంది. మధ్యయుగ కాలం నుండి ముస్లింలతో పాటు భారీగా హిందువులు కూడా ఈ స్థలాన్ని సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బరోడా మహారాజు 1800 సంవత్సరంలో దర్గాపై కవచాన్ని నిర్మించారు. ప్రస్తుతం, మొయినుద్దీన్ చిస్తీ సమాధి భారత ఉపఖండంలోని సున్నీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన సందర్శనా స్థలాలలో ఒకటి. భారత ఉపఖండం నలుమూలల నుండి వందల, వేల మంది ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. 2019లో, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ స్వచ్ఛ భారత్ అభియాన్ కింద దర్గా కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించింది. 2015లో, మొయినుద్దీన్ చిస్టీ 808వ ఉర్స్‌లో ముస్లిం మతపెద్దలతో జరిగిన కార్యక్రమంలో.. అజ్మీర్ షరీఫ్ దర్గాలో సమర్పించిన 'చాదర్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందించారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ దర్గా పలు వివాదాలకు కూడా కేంద్రంగా ఉంది. 1992 అజ్మీర్ రేప్ కేసు నుండీ.. 2007లో టిఫిన్ క్యారియర్ బాంబు ఘటన వరకూ ఈ ప్రదేశం పాపులర్ అయ్యింది. రంజాన్ మాసంలో ఉపవాస ప్రార్థనల తర్వాత జనాలు గుమ్మిగూడిన ప్రదేశంలో బాంబు పేలింది. ఈ పేలుడులో ఏడుగురు చనిపోగా, 17 మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యేక న్యాయమూర్తి దినేష్ గుప్తా.. 149 మంది సాక్షుల వాంగ్మూలాలు, 451 పత్రాల ఆధారంగా దాదాపు 500 పేజీల తీర్పును సమర్పించారు. జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక న్యాయస్థానం దీనికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ ప్రచారక్‌లు కారణమని తేల్చింది. నేరస్థులకు జీవిత ఖైదు విధించారు. అలాగే, 5 జూలై 2022న, ముహమ్మద్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు సస్పెండ్ అయిన భారతీయ జనతా పార్టీ ప్రతినిధి నూపుర్ శర్మ తల నరికేయాలని చెప్పిన దర్గా సంరక్షుడు సల్మాన్ చిస్తీని కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిజానికి, హిందువులు దేవుడిగా పూజించే రాముడు ఎప్పుడూ తాను పరమాత్మనని ప్రకటించుకోలేదు. సాధారణ మనిషిగానే జీవించాడు, చెప్పుకున్నాడు. రావణుడిపై యుద్ధం కూడా అలాగే పలువురి సహకారంతో చేశాడు. ముఖ్యంగా, రాముడికి పదవీకాంక్ష లేదు. ఇంద్ర పదవిని కూడా నాకొద్దని తిరస్కరించిన వ్యక్తి. ఉత్తమ నాయకుడు ఎప్పుడూ ఏకపక్షంగా వ్యవహరించడనే సిద్ధాంతం చెప్పిన గొప్ప రాజు. ఏ దశలోనూ తాను ప్రతికార రాజకీయాలను ప్రోత్సహించలేదు. యుద్ధం యోధులతోనే.. సామాన్య ప్రజలు మనకు శత్రువులు కాదని స్పష్టం చేశాడు. రాముడికి ఉన్న ఆ విచక్షణా గుణమే.. నాయకులలో ఉత్తమ నాయకుడిగా, యోధులలో మహాయోధుడిగా, పాలకులలో అత్యుత్తమ పాలకుడిగా నిలిచింది. అదే రామ సార్వభౌముడికి పట్టాభిషేకం చేసింది. ఇప్పుడున్న రాజకీయ నాయకుల్లో కావలసింది సరిగ్గా ఇలాంటి నాయకత్వమే. అప్పుడే, ఇలాంటి విభజన రాజకీయాలకు ముగింపు వస్తుందనేది చాలా మంది అభిప్రాయం.

# ఢిల్లీలో విచిత్రమైన వాతావరణం

న్యూఢిల్లీ : డిసెంబరు నెల ప్రారంభమైనప్పటికీ ఢిల్లీలో చలి మాత్రం కనిపించడం లేదు. ఢిల్లీలో మధ్యాహ్నం చాలా వేడిగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. డిసెంబరు మొదలైంది కానీ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో చలి వణికిపోయే సూచనలు కనిపించడం లేదు. సాధారణంగా, డిసెంబర్ ప్రారంభంతో రాజధాని ఢిల్లీలో తీవ్రమైన చలి మొదలవుతుంది. అయితే ఈ సంవత్సరం డిసెంబర్ మొదటి వారంలో గత దశాబ్దంలో అత్యంత వేడిగా ఉంటుంది. చలి తీవ్రత కోసం ఢిల్లీ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ ఉదయం, సాయంత్రం మాత్రమే కాస్త చలికాలంలా అనిపిస్తుంది. అర్ధరాత్రి కాస్త చల్లగాలి వీస్తోంది. అయితే మధ్యాహ్న సమయంలో ఎండలు ఎక్కువగా ఉండడంతో వేడిగా ఉంటుంది. ఇప్పుడు ఢిల్లీలో చలి తీవ్రత ఎప్పుడు మొదలవుతుందని అక్కడి ప్రజలు ఆలోచిస్తున్నారుడిసెంబరులో ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 24 నుండి 26 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా నమోదవుతుంది. కానీ ఈసారి డిసెంబర్ మొదటి వారంలో ఉష్ణోగ్రత 26-27 డిగ్రీల వరకు ఉండవచ్చు. వాతావరణ శాఖ ప్రకారం, 2011 తర్వాత నుంచి డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో ఇటువంటి వాతావరణ నమూనాలు కనిపించలేదు. ఢిల్లీలో చలి తీవ్రతతో డిసెంబర్ ప్రారంభం అవుతుంది. రుతుపవనాల కారణంగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో వాతావరణం పొడిగా ఉంది. అక్టోబర్, నవంబర్‌లో ఒక్కసారి కూడా వర్షాలు పడలేదు. ఈ కాలంలో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ, చలిని పెంచడంలో వర్షం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ వర్షం పూర్తిగా వెస్ట్రన్ డిస్ట్రబెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం వెస్టన్ డిస్టర్బెన్స్ బలహీనంగా ఉంది, దీని కారణంగా ఢిల్లీతో సహా ఉత్తర భారతదేశంలో తీవ్రమైన చలి లేదు. బలహీనమైన పాశ్చాత్య డిస్ట్రబెన్స్ కారణంగా, ఈసారి శీతాకాలం ఢిల్లీ-ఎన్ సీఆర్, ఉత్తర భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కొంచెం ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం డిసెంబర్ 5 తర్వాత ఢిల్లీలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. ఈ సమయంలో రాజధానిలో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల వరకు, గరిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ వరకు వెళ్లవచ్చు. నగరంలో తెల్లవారుజామున తేలికపాటి పొగమంచు కనిపించవచ్చు. ఆ తర్వాత డిసెంబర్ 6, 7 తేదీల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. డిసెంబర్ 12 లేదా 15 తర్వాత కూడా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో చలికాలం మొదలవుతుందని చెబుతున్నారు. డిసెంబర్ 8-9 తేదీల్లో వెస్టన్ డిస్ట్రబెన్స్ యాక్టివ్‌గా ఉంటుందని, దీని ప్రభావం ఉత్తర భారతదేశ వాతావరణంపై కనిపించవచ్చని చెప్పబడింది. ఢిల్లీ మినహా ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో ఉదయం, సాయంత్రం చలి గణనీయంగా పెరిగింది. వచ్చే వారంలో చలి మరింత పెరగనుందని, ఉష్ణోగ్రత కూడా గణనీయంగా తగ్గుతుందని వాతావరణ శాఖ తెలిపింది.



## అమరావతి పనులకు...




పిలిచేందుకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. రూ.11,471 కోట్లతో అమరావతిలో పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు మంత్రి నారాయణ పేర్కొన్నారు. అమరావతిలో నిర్మించిన ఆస్తులకు గత ప్రభుత్వ హయాంలో రూ.286 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అన్నారు. రహదారుల ధ్వంసం కారణంగా మరో రూ.150 కోట్ల నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ టెండర్లు పిలవడం ద్వారా రూ.452 కోట్ల మేర అదనపు జీఎస్టీ భారం పడుతుందని వివరించారు. 014-19 మధ్య మిగిలిన పనుల విలువ రూ.7,391 కోట్లు అని మంత్రి నారాయణ వెల్లడించారు. టెండర్ల ద్వారా పనుల విలువ రూ.2,507 కోట్ల మేర పెరిగిందని... గత ప్రభుత్వం పనులు చేసి ఉంటే, ప్రస్తుత ప్రభుత్వంపై ఈ భారం తగ్గేదని అన్నారు. ఇక, ట్రంక్ రోడ్ల నిర్మాణానికి రూ.461 కోట్ల మేర ధర పెరిగిందని, అమరావతిలో 320 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారులు, 1200 కిలోమీటర్ల మేర లేఅవుట్ రోడ్లు పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. అసెంబ్లీ భవనం, హైకోర్టు భవనం, 5 పరిపాలనా భవనాలు, 3,600 అపార్ట్ మెంట్లు పూర్తికావాల్సి ఉందని మంత్రి నారాయణ వివరించారు. రాజధానికి సంబంధించి సాంకేతిక, న్యాయపరమైన అంశాలన్నీ పూర్తయ్యాయని, నెలాఖరులో అన్ని టెండర్లు పిలిచి వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మూడేళ్లలో పనులన్నీ పూర్తి చేసేలా కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రాజధాని పనులకు గతంలో రూ.41 వేల కోట్ల మేర అంచనాలు రూపొందించామని, ఇప్పుడు ఆ పనులకు మరో 30 శాతం మేర అదనంగా ఖర్చవుతుందని అన్నారు.

## బియ్యం అక్రమ రవాణాలో...

తన వియ్యంకుడిపై వస్తున్న ఆరోపణలపై ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. రేషన్ బియ్యంతో తన వియ్యంకుడికి సంబంధం లేదని.. రైతుల దగ్గర ధాన్యం కొని.. మిల్లింగ్ చేసుకుని ఎగుమతి చేస్తారని స్పష్టం చేశారు. తమ వియ్యంకుడి కుటుంబం మూడు తరాలుగా బాయిల్డ్ రైస్ ఎగుమతి వ్యాపారం చేస్తున్నారని పయ్యావుల కేశవ్ తెలిపారు. వాళ్ల కుటుంబం ముడి బియ్యం వ్యాపారం చేయదని.. కేవలం స్టీమ్ రైస్ మాత్రమే ఎగుమతి చేస్తుందని పేర్కొన్నారు. తనతో వియ్యం పొందాక ఆయన బియ్యం వ్యాపారం చేయడం లేదని చెప్పారు. రేషన్ బియ్యంతో తన వియ్యంకుడి వ్యాపారానికి సంబంధం లేదని వెల్లడించారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి సొంత ఫ్యాక్టరీలో మిల్లింగ్ చేసుకుని ఎగుమతి చేస్తారని స్పష్టం చేశారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనే తమ వియ్యంకుడు బియ్యం వ్యాపారం చేస్తున్నారని.. ఏపీలో గింజ కూడా కొనుగోలు చేయలేదని పయ్యావుల కేశవ్ అన్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబుకు అనుమానం ఉంటే చెక్ పోస్టు దగ్గర ప్రతి బ్యాగ్ తనిఖీ చేసుకోవచ్చని సవాలు విసిరారు. ఆ తనిఖీలకు తానే అన్ని అనుమతులు ఇప్పిస్తానని కూడా చెప్పారు.

## మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లో...

ఏమిటని? కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రశ్నించే వారికి స్వేచ్ఛ లేదా? వారిని బతకనివ్వరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు పరిమిత సంఖ్యలోనే ఉండవచ్చని, కానీ వారితో పాటు కమ్యూనిస్టులందరి భావజాలం ప్రశ్నించడమేనని, ప్రశ్నించే వారందరినీ చంపేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. అసలు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లు తెలంగాణ ప్రభుత్వానికి తెలిసి జరుగుతున్నాయా? తెలియక జరుగుతున్నాయా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ -తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ పోలీసులు ఎందుకు పాల్గొన్నారని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తెలియకుండా జరిగితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని జరుగుతున్న పరిణామాలపై సమీక్షించాలని సాంబశివరావు సూచించారు. దేశంలో మానవ హక్కుల పరిరక్షణలో అత్యున్నత న్యాయవ్యవస్థ భాగస్వామ్యం కావాలని, పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగిన సంఘటనలను న్యాయవ్యవస్థ సుమోటోను బాధ్యతగా తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. న్యాయవ్యవస్థ పట్టించుకోనట్లయితే దేశంలో మానవ హక్కులకు స్థానం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మేకపాటి సోదరులు ఎక్కడ ?

నెల్లూరు : నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం నుంచి మేకపాటి కుటుంబ సభ్యులు నాలుగు సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు. ఉదయగిరి గడ్డ తమదే అన్నట్టు తమ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గా ఉండాలని మేకపాటి ఫ్యామిలీ భావించేది. మొన్నటి ఎన్నికల్లోఎంత మంది టికెట్ కోసం పోటీ పడినా మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి హైకామాండ్‌ను ఒప్పించి తమ్ముడు రాజగోపాల్ రెడ్డికి టికెట్ ఇప్పించి బరిలో నిలబెట్టారు. అదే కుటుంబం నుంచి నాలుగు సార్లు గెలిచిన మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని కుటుంబ వ్యవహారాలతో మేకపాటి రాజమోహన్ రెడ్డి పక్కన పెట్టారు. ఉదయగిరి నుంచి 2019 ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వైసిపికి ఓటు వేయకుండా టిడిపికి ఓటు వేశారని ఆరోపణలతో రావడంతో వైసిపి అధిష్టానం ఆయన్ని బహిష్కరించింది అప్పటి నుంచి ఉదయగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్ గా రాజమోహన్‌రెడ్డి మరో తమ్ముడు మేకపాటి రాజగోపాల్ రెడ్డి ని వైసీపీ అధిష్టానం నియమించింది. అప్పటినుంచి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఉదయగిరికి తానే కాబోయే ఎమ్మెల్యేని అన్న ఆలోచనలతో అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టించారు. ఎక్కడ మీటింగ్లు, సమావేశాలు జరిగిన తాను నివాసం ఉంటున్న మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి నుండి పోలీసులు ఎస్కార్ట్ తో రావాలని అప్పట్లోనే హుకుం జారీ చేశారు. ఉదయగిరి నియోజకవర్గానికి తాను కాబోయే ఎమ్మెల్యేనని తన మాట వినకపోతే రాబోయే రోజుల్లో తగిన లెక్కలు ఉంటాయని బెదిరింపులకు కూడా పాల్పడినట్లు చెపుతారు. 2024 ముందు జరిగిన ఎన్నికల ప్రచారంలో ఉదయగిరి నియోజకవర్గం టికెట్ కోసం ఎంతోమంది వ్యాపారవేత్తలు పోటీపడినప్పటికీ వైసీపీ అధిష్టానం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాటలకు కట్టుబడి తన రెండో తమ్ముడైన మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఉదయగిరి టికెట్ ను కట్టబెట్టింది. అప్పటినుంచి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఉదయగిరిలో మరింత జోరు పెంచారు. తానే ఉదయగిరి కి బాస్ అంటూ తాము గెలిస్తే ప్రతి ఒక్కరి అంతు చూస్తామంటూ ప్రత్యర్థి అయినా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఉన్న కాకర్ల సురేష్ పై ఒక రేంజ్ లో విరుచుకుపడ్డారు. నారా లోకేష్ రెడ్‌బుక్కులో రాసుకుంటే తాను బ్లూ బుక్కులో రాసుకుంటున్నానని.. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఒకొక్కరి అంతు తేలుస్తానని ప్రచారంలో వార్నింగులు ఇచ్చారు. ఉదయగిరి మండలంలోని కొండ కింద పల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పుడు ప్రజలను మేకపాటి రాజగోపాల్ రెడ్డి బెదిరించారట. తమకు ఓటు వేయకుండా ఏ ఒక్కరూ టిడిపికి ఓటు వేసిన పల్లె గ్రామాలలో ఒక్కరు కూడా మిగలరని గట్టిగా వార్నింగ్ ఇచ్చారట. మళ్లీ గెలిచి తీరతామన్న ధీమాతో కొండాపురం మండలంలో తాహసిల్దారు ఓ సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆయనను ఇష్టమొచ్చినట్లు వాయించారాయన. ఇలా మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఓటర్లను, అధికారులను బెదిరించిన ఎఫెక్ట్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఘోర పరాజయం పాలయ్యారుపోలింగ్ సమయంలో మేకపాటి ఓటర్లను డబ్బులతో మబ్బు పెట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వైసిపి అభ్యర్థిగా పోటీచేసిన మేకపాటి రాజగోపాల్ రెడ్డి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉదయగిరిలో అడ్రస్ లేకుండా పోయారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఉండే ప్రధాన నాయకులు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారంట. ఆ క్రమంలో ఇక ఉదయగిరిలో మేకపాటి ఫ్యామిలీ సీన్ అయిపోయిందంటూ.. కొందరు నేతలు కూటమి పార్టీల్లో చేరిపోతున్నారు . ఉదయగిరి సెగ్మెంట్లో వైసీపీలో దూకుడు ప్రదర్శించిన సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు నమోదవుతున్నాయి. కేసులు ఎదుర్కొంటున్న కార్యకర్తలు తమను పట్టించుకునే వారే లేకుండా పోయారని కన్నీరు పెట్టుకుంటున్నారు. మొత్తానికి ఉదయగిరి వైసీపీ అనాథలా మారిందిప్పుడు.



## బీజేపీ నిర్ణయంతో...

మంత్రి రామ్‌దాస్ అథవాలే కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నిర్ణయంతో షిండే కలత చెందారన్నది వాస్తవమేనని అన్నారు. అయినా, బీజేపీ తన నిర్ణయాన్ని మార్చుకోదని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండున్నరేళ్లపాటు ఆయన సీఎంగా కొనసాగారని గుర్తు చేశారు. ప్రభుత్వం కూలిపోయిన సమయంలో.. బీజేపీకి ఎక్కువ ఎమ్మెల్యేల బలం ఉన్నప్పటికీ సీఎం పీఠాన్ని షిండేకు అప్పగించిందని గుర్తు చేశారు. అప్పుడు అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించి దేవేంద్ర ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా కొనసాగారని చెప్పుకొచ్చారు. కానీ, ఇప్పుడు సీఎం పదవిని వదులుకునేందుకు బీజేపీ సిద్ధంగా లేదన్నారు. ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడంతోపాటు పార్టీని బలోపేతం చేసుకునేందుకు ఇది సరైన సమయమని హైకమాండ్ భావిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అందుకే సీఎం విషయంలో బీజేపీ తన నిర్ణయాన్ని మార్చుకునే పరిస్థితులు లేవన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో షిండే ఉపముఖ్యమంత్రి పదవిని తీసుకోవడం మంచిదని సూచించారు. లేదంటే మహాయుతి కూటమి చైర్మన్‌గా.. అది కూడా నచ్చకపోతే కేంద్ర ప్రభుత్వంలో స్థానం కోరుకోవడమే తన ముందున్న దారులని అథవాలే వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కూటమిలోని బీజేపీకి 132 సీట్లు, షిండే సేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో అత్యధిక సీట్లు సాధించిన బీజేపీనే ఈసారి సీఎం పదవి చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీసే మహా తదుపరి ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రటకన వెలువడాల్సి ఉంది. మరోవైపు ఈనెల 5న సీఎం, డిప్యూటీ సీఎంల ప్రమాణ స్వీకారం ఉంటుందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. . అయితే, కేబినెట్ కూర్పు ఇంకా పూర్తి కాని కారణంగా.. ఆ రోజు సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంలు మాత్రమే ప్రమాణం చేస్తారని సదరు వర్గాలు తెలిపాయి. సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల ప్రమాణ స్వీకారం ఉంటుందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది.

## తాజ్ మహల్‌కు బాంబు...

పోలీసులు అధికారులు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్ పర్యాటక విభాగానికి మంగళవారం ఇ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ మేరకు అధికారులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. తాజ్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ తాజ్ సెక్యూరిటీ సయ్యద్ అరీబ్ అహ్మద్ తెలిపారు. బాంబు బెదిరింపు వట్టిదేనన్నారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, పోలీసుల బృందాలను రంగంలోకి దింపి తనిఖీలు నిర్వహించామని.. అనుమానాస్పద వస్తువులు దొరకలేదని అరీబ్ అహ్మద్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో బెదిరింపులు పెరిగిన విషయం తెలిసిందే. విమానాలు, విమానాశ్రయాలు, పాఠశాలలకు ఇటీవల వరుసగా బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది నవంబర్ 13 వరకు దేశీయ విమానాయాన సంస్థలకు దాదాపు 1,143 బాంబు బెదిరింపులు వచ్చాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ రాజ్యసభకు తెలిపారు. బెదిరింపులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## కొత్త న్యాయ చట్టాల అమలు...

ఉపయోగపడుతాయన్నారు. కొత్త చట్టాలతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. డిజిటల్ ఆధారాలు, టెక్నాలజీ ఏకీకరణతో.. ఉగ్రవాదంపై పోరాడేందుకు సులువు అవుతుందని, ఉగ్రవాదులు.. ఉగ్ర సంస్థలు తప్పించుకోలేని రీతిలో కొత్త చట్టాలు పకడ్బందీగా ఉన్నట్లు ప్రధాని తెలిపారు. గతంలో ఉన్న క్రిమినల్ చట్టాలు భారతీయుల్ని శిక్షించాలన్న ఉద్దేశంతో ఉన్నాయని, వాళ్లను బానిసలుగా చూసే విధంగా చట్టాలను ఉన్నట్లు చెప్పారు. బానిసల కోసం చట్టాలను మనం ఎందుకు అమలు చేయాలని ప్రధాని ప్రశ్నించారు. బ్రిటీష్ కాలం నాటి మైండ్‌సెట్ నుంచి దేశ ప్రజలు బయటపడాలన్నారు.

## వివిధ ప్రభుత్వ పాలసీలకు...

బియ్యం అక్రమ రవాణా అంశం కూడా చర్చించారు. ప్రభుత్వానికి ఈ మాఫియా సవాల్ గా మారిందని, దీనికి అడ్డుకట్ట వేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. కాకినాడ పోర్టులో అరబిందో సంస్థ 41 శాతం వాటాను లాగేసుకుందని ఆరోపించారు. ఆస్తులు గుంజుకోవడం వైసీపీ హయాంలో ట్రెండ్ గా మారిందని వ్యాఖ్యానించారు. ఇక, కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ పథకం రాష్ట్రంలో అమలు చేయడంలో ఆలస్యం జరుగుతుండడం పట్ల చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ వంటి ప్రాధాన్య పథకం ఇంకా డీపీఆర్ స్థాయిని దాటకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, తాగునీటి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కూడా మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ ను ఏపీ సద్వినియోగం చేసుకోవడంలేదని ఢిల్లీలో కూడా చెప్పుకుంటున్నారని వెల్లడించారు. అధికారుల ఉదాసీనత వల్లే ఈ పథకం ఆలస్యమవుతోందని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఈ పథకంపై స్పందించారు. ఇది అందరికీ చేరువయ్యే భారీ ప్రాజెక్టు అని... దీన్ని మిషన్ మోడ్ లో ముందుకు తీసుకెళ్లడం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని స్పష్టం చేశారు.

## ఢిల్లీకి రావాలంటేనే విసుగు...

ప్రస్తుతం రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందన్నారు. లక్షల కోట్ల విలువైన దిగుమతుల నేపథ్యంలో ఈ ప్రభావం మన ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, జీవావరణంపై పడుతోందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించుకోవచ్చని వ్యాఖ్యానించారు.

## తెలంగాణ ఉద్యమాన్ని ...



ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ గారి అరెస్ట్ ను చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి ఆహుతి అయ్యి అమరుడయ్యాడు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయనకు జోహార్లు అర్పిస్తున్నాను. జోహార్ శ్రీకాంతాచారి! జై తెలంగాణ.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# పీఏల దగ్గరే... అంతా కేసుల ఉచ్చు

శ్రీకాకుళం : రాజకీయ నాయకులకు వ్యక్తిగత కార్యదర్శులు ఎంతో కీలకం. నేతల డెయిలీ రొటీన్, ఇతరాత్ర వ్యవహారాలన్నీ ఆ పీఏలే చూస్తుంటారు. అందుకే నాయకుల రాజకీయ జీవితంలో పీఏలు భాగమవుతుంటారు. సాధారణంగా ఆ పీఏలకు తెలియకుండా నేతల జీవితాల్లో ఏదీ జరగదు. అందుకే ఆ పీఏలను టార్గెట్ చేస్తూ గత ప్రభుత్వంలో ఆరోపణలు ఎదుర్కొన్న వైసీపీ నేతల గుట్టు బయటపెట్టడానికి కూటమి ప్రభుత్వం స్కెచ్ గీస్తున్నట్లు కనిపిస్తుంది. తాజాగా మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ వద్ద గతంలో ప్రభుత్వ పీఏగా చేసిన గొండు మురళి ఆస్తులపై ఏసీబీ రైడ్స్ నిర్వహించింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో శాఖ, శ్రీకాకుళం జిల్లాలో మొత్తం ఆరు చోట్ల సోదాలు నిర్వహించారు ఏసీబీ అధికారులు. కృష్ణ దాసు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో సుదీర్ఘకాలం ఆయన వద్ద మురళీ పీఏగా పని చేశారు. కృష్ణ దాస్‌కి సన్నిహితుడిగా మెలిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు తన మాతృశాఖ అయిన వైద్య ఆరోగ్యశాఖలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని బుడితి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓ సాధారణ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న మురళీ ఆస్తుల వివరాలు చూస్తే కళ్లు తిరిగాల్సిందే. గొండు మురళికి చెందిన 20 ఎకరాలకు పైగా భూమి, విశాఖ, శ్రీకాకుళం సహా పలు ప్రాంతాల్లో పలు ప్లాట్లు, ఫ్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు, కిలో బంగారు ఆభరణాలు, 11.36 కిలోల వెండి వస్తువులు తదితరాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి మార్కెట్ విలువ రూ.70 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేశారు. ఆ ఆస్తులు మురళీ అక్రమార్జనా? లేకపోతే ఆయన ఎవరికైనా బినామీనా అన్న దానిపై విచారణ జరుగుతుందంట. ఇప్పటికే మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసు భూ రికార్డుల దహనం కేసులో నిందితుల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఆయన పీఏలు శశికాంత్, తుకారం ఇళ్లలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పీఏ శశికాంత్ ఇంట్లో భారీగా దస్త్రాలు గుర్తించిన పోలీసులు.. నాలుగు బాక్సుల్లో కీలక దస్త్రాల స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ భయంతో పెద్దిరెడ్డి అధికారిక పీఏ తుకారాం ఇప్పటికే విదేశాలకు పారర్ అయినట్లు తెలుస్తోంది. మరో వైసీపీ నేత, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు సంబంధించిన కేసులో అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి పరారీలో ఉన్నాడు. అతను దాఖలు చేసుకున్న ముందుస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. అతను అప్పటి ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, అనిత, మంద కృష్ణమాదిగ, షర్మిల తదితరులపై వైసీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో అసభ్యకర పోస్టులు పెట్టారు. వాటిపై అందిన ఫిర్యాదుల మేరకు వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి మరికొందరిపై పులివెందులలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అదే కేసులో బండి రాఘవరెడ్డి నిందితుడిగా ఉన్నాడు. ఆ క్రమంలో నేతల పీఏల వ్యవహారం పొలిటికల్ సర్కిల్స్‌లో హాటా టాపిక్‌గా మారింది. నేతల గురించి అన్ని విషయాలు తెలిసిన పీఏలను వ్యూహాత్మకంగానే టార్గెట్ చేస్తున్నారని.. వారిని టార్గెట్ చేసి పెద్ద చేపలకు గాలం వేయడానికి స్కెచ్ గీస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## 3 సార్లు బయోమెట్రిక్ పక్కా

విజయవాడ : చివాలయ ఉద్యోగుల అటెండెన్స్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సచివాలయ ఉద్యోగులంతా రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. సచివాలయ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. సచివాలయ ఉద్యోగులంతా రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఉదయం సచివాలయానికి వచ్చినప్పుడు, మళ్లీ సాయంత్రం సచివాలయం నుంచి వెళ్లినప్పుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలి. కనీసం రెండు సార్లు వేయకపోతే ఆ రోజు వేతనం కట్ అవుతుంది. ఈ విధానాన్ని సచివాలయ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు ఆధారంగా జీతాలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర సచివాలయ శాఖ ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒక రోజు ఉదయం నిర్ణీత సమయంలోనూ, సాయంత్రం ఉద్యోగ పనులు ముగించుకుని వెళ్లే సమయంలో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఉదయం వేసి, సాయంత్రం బయో మెట్రిక్ వేయడం మరిచిపోతే ఆ రోజు మొత్తం వేతనం కట్ చేస్తారు. మధ్యాహ్నం కూడా బయోమెట్రిక్ వేయాలని సచివాలయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ రకమైన విధానంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఎందుకంటే సాయంత్రం ఇంటికి వెళ్లిన సమయంలో బయోమెట్రిక్ పని చేయకపోతే ఉద్యోగులు బయోమెట్రిక్ వేయలేరు. అలాగే మధ్యాహ్నం సర్వేయర్, టెక్నికల్ అసిస్టెంట్ ఇతర ఉద్యోగులు ఫీల్డ్‌కు వెళ్లి రాత్రి అవుతుందని అటునుంచి అటే ఇంటికి వెళ్లలేరు. తప్పనిసరిగా సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసే ఇంటికి వెళ్లాలి. కొంత మంది మరిచిపోవచ్చు. ఇలా చాలా సమస్యలు ఉన్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. ఇలాంటి విధానం రాష్ట్రంలోని ఇతర ఉద్యోగులకు ఎందుకు లేదు? కేవలం సచివాలయ ఉద్యోగులపైనే ఎందుకు ఈ కక్ష అంటున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల అందరినీ ప్రభుత్వం సమాన దృష్టితో చూడాలని పేర్కొంటున్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రమే ఇలా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. మిగతా ప్రభుత్వ ఉద్యోగుల వలె ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసే అవకాశం కల్పించాలని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. మరోవైపు సచివాలయ ఉద్యోగుల హాజరు సైకిల్ కూడా నెలలో 1 నుంచి ఆఖరు వరకు మార్చారు. ఈ విధానం నవంబర్ 1 నుంచి అమలులో తీసుకొచ్చారు. 2021 ఫిబ్రవరి 4 విడుదల చేసిన జీవోఎంఎస్ నెంబర్ 1 ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో నెలలో 23 తేదీ నుంచి నుంచి వచ్చే 22 వ తేదీ వరకు ఉండేది. రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో 1,30,694 మంది ఉద్యోగులు ఉన్నారు.

## విమానశ్రయాల మాదిరిగా... రైల్వేస్టేషన్లు

గుంటూరు : రైల్వే ప్రయాణికులకు ఎయిర్‌పోర్ట్ స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు.. సౌత్ సెంట్రల్ రైల్వే చర్యలు చేపట్టింది. గుంటూరు రైల్వేస్టేషన్ సహా డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో మెరుగైన సదుపాయాల కల్పనపై రైల్వే అధికారులు ఫోకస్ పెట్టారు. రూ.100 కోట్లతో నిర్మాణాలు చేపట్టనున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్, డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పనపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. ఇందుకోసం తయారు చేసిన డీపీఆర్‌లకు ఆమోదం లభించింది. దీంతో రూ. 100 కోట్లతో ఫుట్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇప్పటివరకు రైల్వే స్టేషన్లలో మూడు, ఆరు మీటర్ల వెడల్పుతో ఫుట్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. కానీ.. భవిష్యత్తులో పెరగనున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 12 మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. విమానాశ్రయాల్లో అందించే సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఈ ఫుట్ బ్రిడ్జిలను ఉపయోగించనున్నారు. వీటిని చాలా వెడల్పుగా నిర్మిస్తున్నందునా.. మాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు ఒకసారి స్టేషన్లోకి వచ్చాక.. ఏ అవసరం వచ్చినా బయటకు వెళ్లక్కర్లేకుండానే అందుబాటులోకి తెస్తున్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో గుంటూరు, రేపల్లె, నరసరావుపేట, పిడుగురాళ్ల, మార్కాపురం, దొనకొండ, నంద్యాల, నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నారవీటి నిర్మాణాల కోసం స్థలాల ఎంపిక పూర్తయింది.

# విద్యుత్ బిల్లుల భారం



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వినియోగదారులపై కొత్త సర్దుబాటు భారం మొదలైంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి అమోదంతో రాష్ట్ర వ్యాప్తంగా రూ.6వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూలు మొదలైంది. వచ్చే నెలలో మరో సర్దుబాటు భారం మొదలు కానుంది. పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్ నెల విద్యుత్ బిల్లులతో కొత్త సర్దుబాటు భారం మొదలైంది. ఏపీ ఈర్సీ ఆమోదంతో రూ. 6072 కోట్ల వసూళ్లను విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రారంభించాయి. కొత్త సర్‌ఛార్జీలతో విద్యుత్ బిల్లులు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం ఏపీలో మూడు రకాల సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నారు. వచ్చే నెల నుండి మరో సర్దుపోటు పడనుంది. మొత్తం 15,484 కోట్ల రూపాయల విద్యుత్ భారం రాష్ట్ర ప్రజలపై పడనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల తిరగకముందే 15,484 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై పడనుంది. 2022 -23 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్ పై 6072 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల వసూలు మొదలైంది. నెల నుండి 2023 -24 సర్దుబాటు చార్జీ 9412 కోట్ల రూపాయల భారం పడనుంది. 2014-19 ట్రూ అప్ చార్జీలుగా గత నెల బిల్లులపై 40 పైసలు సర్దుబాటు చార్జీ వసూలు చేస్తున్నారు. తాజాగా మూడవ సర్దుబాటు చార్జీ బిల్లులో వేశారు, వచ్చేనెల 4వ సర్దుబాటు చార్జీ కలపటానికి రంగం సిద్ధం అయ్యింది. సర్దుబాటు ఛార్జీలతో ఈ నెల బిల్లులలో 10 శాతం నుండి 30 శాతం వరకు బిల్లులు పెరిగాయి. విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు ఛార్జీల భారంపై పోరాటాలకు సీపీఎం సిద్ధం అవుతోంది. అజిత్ సింగ్ నగర్‌లోని లింగం వెంకటలక్ష్మి కి మొత్తం రూ.958 బిల్లు రాగా, అందులో రూ.282 30%)2022-23 సర్దుబాటు చార్జీగా పేర్కొన్నారు. బిల్లులో వినియోగించిన విద్యుత్ ఛార్జీలు 30 శాతం ఉంటే సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీలు 70 శాతం ఉంటున్నాయి. ఈ సర్దుబాటు చార్జీల పాపం పాలక పార్టీలన్నింటిదని, కేంద్రంలోని బీజేపీ, గతంలో పాలించిన వైసిపి, నేడు పాలిస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటికి బాధ్యత వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, తగ్గిస్తామని మాట ఇచ్చిన కూటమి మాట తప్పి ప్రజలను వంచించిందని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేయాల్సిన బాధ్యత కూటమిపై ఉండగా ,భారం మోపి చేతులు దులుపుకోవడం సరికాదని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ధరలు యూనిట్ 12 రూపాయల నుండి క్రమంగా రెండు రుపాయలకు తగ్గాయని చెబుతూనే, ఛార్జీలు మాత్రం తగ్గించకుండా పెంచడం అన్యాయమంటున్నారు. అదానీ వద్ద నుండి వందలాది కోట్ల రూపాయలు ముడుపులు తీసుకుని, ప్రజలపై భారాల మోపే ఒప్పందాలను బిజెపి, వైసిపి పార్టీలు చేశాయని, ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా తెలుగుదేశం, జనసేన వారితో కుమ్మక్కు అవుతున్నాయని సీపీఎం నాయకుడు చిగురుపాటి బాబురావు ఆరోపించారు. విద్యుత్ ఛార్జీల భారంలో బీజేపీ, వైసీపీ, తెలుగుదేశం, జనసేనలు ఉన్నాయని బడా కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలు వలనే విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయని ఆరోపించారు. పెరిగిన విద్యుత్ చార్జీలపై ప్రజలు గళం విప్పాలి. కేంద్ర, రాష్ట్ర పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ పాపాన్ని గమనించాలని, మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల భారాన్ని నిలిపివేయాలని, అదానీ, జగన్, కేంద్ర ప్రభుత్వ కుంభకోణంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి. మాట ఇచ్చినట్లు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి, స్మార్ట్ మీటర్లను ఆపాలని డిమాండ్ చేశారు.

# కొడాలి నానిని చుట్టుముడుతున్న కేసులు



విజయవాడ : కొడాలి నాని. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని ఈ నేత కాంట్రవర్సీలకు కేరాఫ్. వైసీపీ హయాంలో చంద్రబాబు, లోకేశ్‌ను అడ్డగోలుగా బూతులు తిట్టారని..వాళ్ల కుటుంబ సభ్యుల మీద కూడా అడ్డగోలుగా మాట్లాడారని నాని మీద టీడీపీ క్యాడర్ ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో ఆ మధ్య విశాఖలో కొడాలి మీద ఓ యువతి కంప్లైంట్ చేశారు. ఆ తర్వాత కూడా అక్కడక్కడ కేసులు నమోదయ్యాయి. అదే ఊపులో కొడాలి నానిని కూడా అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఈలోపే గుడివాడలో జగనన్న కాలనీ స్థలాల స్టోరీ వెలుగులోకి వచ్చింది. జగనన్న కాలనీల కోసం గుడివాడలో సేకరించిన భూములపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు 173 ఎకరాలు సేకరించి..మెరక పేరుతో అనుచరులకు వర్క్ ఆర్డర్స్ ఇచ్చారని నాని మీద ఆరోపణలు ఉన్నాయి. అలా తనకు కావాల్సిన వాళ్లకు పనులు అప్పగించి 8కోట్ల రూపాయలతో పనులు చేపట్టి.. 40 కోట్ల దాకా స్వాహా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందట. త్వరలోనే విజిలెన్స్ రిపోర్ట్ ప్రభుత్వానికి అందబోతున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత నాని మీద తప్పనిసరిగా యాక్షన్ ఉంటుందని అంటున్నారు టీడీపీ నేతలు. అదే సమయంలో గుడివాడలో కొడాలి నాని ప్రధాన అనుచరులపైనా ప్రభుత్వం ఫోకస్ పెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. నానిని చూసుకుని రెచ్చిపోయిన వాళ్లను వదిలిపెట్టొద్దని టీడీపీ అధిష్టానం మీద ఒత్తిడి పెరుగుతోందటజగనన్న కాలనీల కోసం గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెంలో 178.3 ఎకరాలు సేకరించారు. ఎకరా రూ.52 లక్షలు పెట్టి కొన్నారట. అదంతా లోతట్టు ప్రాంతంగా ఉండటంతో సరి చేయాలన్న కారణంతో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కొడాలి నాని..అడ్డగోలుగా వర్క్ చేయించారట. దగ్గరలోని చెరువుల్లో మట్టిని తెంచి నింపేశారట. బిల్లులు మాత్రం ఎక్కడో దూరం నుంచి గ్రావెల్ తరలించినట్లు చూపి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపణలు ఉన్నాయి. మెరక వర్క్ ఆర్డర్లు పొందిన వారంతా కొడాలి నాని అనుచరులేనని..ఆయన బినామీగా ఉన్న వారి ఖాతాల్లోకి సొమ్ము జమ అయిందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపైనే కూటమి సర్కార్ ఇంటర్నల్‌గా విజిలెన్స్ రిపోర్ట్ రెడీ చేయిస్తుందని..ఆ తర్వాత అసలు కథ ఉంటుందని అంటున్నారు. కొడాలి నానిని అన్ని దిక్కుల కార్నర్ చేస్తున్నట్లే కనిపిస్తోంది. ఓ కేసు కాకపోతే మరో కేసు..ఇలా అన్ని దిక్కుల ఇరికించి ఇబ్బంది పెడితేనే మరోసారి బూతు మాటలు మాట్లాడకుండా ఉంటారని టీడీపీ నేతలు..కూటమి ప్రభుత్వం మీద ప్రెజర్ తెస్తున్నారట. ఇప్పటికే నాని మీద యాక్షన్ తీసుకోవడం ఆలస్యమైందని టీడీపీ క్యాడర్ అసంతృప్తిలో ఉందని అంటున్నారు. ఇంటర్నల్ ఎంక్వైరీలతో పూర్తి ఆధారాలు వచ్చాక ఇరికించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే..టీడీపీ క్యాడర్, లీడర్లు మాత్రం నాని మీద ఆగ్రహంతో రగిలిపోతున్నారట. కొడాలి నానిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారంటూ సందర్భం వచ్చినప్పుడల్లా అగ్రనేతలను క్వశ్చన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే కొన్నిరోజులుగా కొడాలి నాని గుడివాడకు రావడం లేదట. ఆయన ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారో కొందరు ముఖ్య నేతలకే తెలుసు అంటున్నారు. తిరుమల లడ్డూ ఇష్యూ అప్పుడు వైసీపీ అధినేత జగన్‌తో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన నాని.. అప్పుడు కూడా చంద్రబాబును టార్గెట్ చేస్తూ మాట్లాడారు. ఆ తర్వాత ఫైర్ బ్రాండ్ లీడర్ తగ్గరంటూ వైసీపీ చర్చకు తెరలేపింది. సేమ్ టైమ్ నాని మీద చర్యలు తీసుకోవాల్సిందేనని టీడీపీ క్యాడర్ పట్టుబడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా కొడాలి నానికి ముఖ్య అనుచరులుగా ఉన్న వారి మీద కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం అవుతోందట. ఆ తర్వాత నానికి కేసులు విచారణలు తప్పవంటున్నారు కూటమి నేతలు.

# జనవరి నుంచి ఆ రెండు పథకాలు




ఏలూరు : ఏపీ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. సంక్షేమ పథకాల అమలుపై ఫుల్ ఫోకస్ పెట్టింది. తాజాగా రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అటు కొత్త పింఛన్ల విషయంలో ఎలా ముందుకెళ్లాలో ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల నాలుగో తేదీన జరగాల్సిన మంత్రివర్గ సమావేశం.. ఒకరోజు ముందుగానే జరగనుంది. అయితే దీనికి ఎంతగానో ప్రాధాన్యత సంతరించుకుంది. క్యాబినెట్ భేటిలో కీలక అంశాలను చర్చించనున్నారు. వాటికి ఆమోద ముద్ర వేయనున్నారు. ఇటీవల కాకినాడ పోర్ట్ లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. డిప్యూటీ సీఎం పవన్ ఆ బియ్యాన్ని పరిశీలించారు. వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా నియంత్రించాలని భావిస్తున్నారు. దీంతో క్యాబినెట్లో బియ్యం అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. రేషన్ బియ్యం పక్కదారిపై ప్రభుత్వం సీరియస్ చర్యలకు దిగే ఛాన్స్ కనిపిస్తోంది. దీనికిగాను ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లో జనవరి నాటికి కొత్త రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మూడు లక్షల మందికి రేషన్ కార్డులు అందించాలని భావిస్తోంది. అయితే పాత రేషన్ కార్డులను సైతం కొత్తగా డిజైన్ చేసి అందించాలని చూస్తోంది. జనవరి 2 నాటికి జన్మభూమి 2 కార్యక్రమం నిర్వహించాలని భావిస్తోంది. అందుకు సంబంధించి విధివిధానాలను సైతం రూపొందిస్తోంది. దీనిపైన మంత్రివర్గ సమావేశంలో చర్చించనుంది ప్రభుత్వం. జన్మభూమి కార్యక్రమంలో నే కొత్త రేషన్ కార్డులతో పాటు ఇతరత్రా సంక్షేమ పథకాలు ఇవ్వాలని భావిస్తోంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవకు బడ్జెట్లో నిధులు కేటాయించింది ప్రభుత్వం. సంక్రాంతి నాటికి రైతుల ఖాతాలో 20వేల రూపాయలు వేయాలని భావిస్తోంది. దానిపైన క్యాబినెట్లో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికే విధివిధానాలను రూపొందించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ పథకాన్ని పరిశీలించి కీలక ప్రతిపాదనలతో ఒక నివేదిక తయారు చేశారు. దానిపై క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. ఒక నిర్ణయం తీసుకుంటారు. ప్రధానంగా కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం తరలింపు, అదాని నుంచి ముడుపులు తీసుకోవడం వంటి అంశాలపై సైతం క్యాబినెట్లో చర్చించే అవకాశం ఉంది. అయితే ఈ నెల 4న జరగాల్సిన క్యాబినెట్ సమావేశం.. ఒకరోజు ముందుగానే నిర్వహిస్తుండడం విశేషం.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై... ఉక్కుపాదం



కాకినాడ : పేదలకు ప్రభుత్వాలు అందించే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏపీ ప్రభుత్వం హెచ్చరించింది. ఏపీలో పోర్టుల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న విదేశీ నౌక పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రి నాదెండ్ల అధ్యక్షతన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్య కుమార్ యాదవ్ మరియు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. కాకినాడ పోర్టులోని అయిదు వేర్ హౌసుల్లో సార్టెక్స్ మిషన్లు ఉన్న అంశంపై చర్చించారు. వేర్ హౌసుల్లో యంత్రాలు ఏ విధంగా ఏర్పాటు చేశారని మారిటైమ్ బోర్డు, కాకినాడ పోర్టు అధికారులను రాష్ట్ర మంత్రులు ప్రశ్నించారు. సార్టెక్స్ యంత్రాలను ఏర్పాటుపై విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టు నుంచి తరలిపోతున్న బియ్యం, ఇతరత్రా అక్రమ రవాణా వ్యవహారంపై మంత్రులు సమీక్షలో కీలకంగా చర్చించారు. నాదెండ్ల, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ జరిపిన సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇకనుంచి ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం. కాకినాడ పోర్టులో భద్రత వ్యవస్థ బలోపేతం చేయాలని నిర్ణయించారు. కాకినాడ పోర్టు భద్రత కోసం ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నియమించాలని చర్చించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని మంత్రులు భావిస్తున్నారు. కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన రవాణా కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. కాకినాడ పోర్టుకు వెళ్లే లారీల నుంచి అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు నాదెండ్ల మనోహర్. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న స్టెల్లా ఓడ ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొదట కాకినాడ కలెక్టర్ , కొందరు ఉన్నతాధికారులతో వెళ్లి కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ సాహసం దేశ వ్యాప్తంగా వైరల్ అయింది. ఆ సమయంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏపీకి వచ్చాక కాకినాడ పోర్టు విషయంపై ఫోకస్ చేశారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కొందరు ఉన్నతాధికారులతో కలిసి వెళ్లి పవన్ కళ్యాణ్ కాకినాడ యాంకరేజ్ పోర్టులో తనిఖీలు చేయడం తెలిసిందే. పవన్ కళ్యాణ్ ను అధికారులు అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ తూర్పు దేశంలో భద్రతకు ముప్పు పొంచి ఉందని, కాకినాడ పోర్టులో కేవలం 16, 17 మంది అధికారులే ఉన్నారని.. టన్నుల కొద్దీ రేషన్ బియ్యం విదేశాలకు రవాణా చేశారని ఆరోపించారు. సీజ్ ద షిప్ అంటూ పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో దేశ వ్యాప్తంగా ట్రెండ్ అయింది. అయితే కేంద్రం పరిధిలో ఉన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి చర్యలు తీసుకునే అధికారం లేదని, కేంద్రానికి ఫిర్యాదు చేయాలని నిబంధనలు చెబుతున్నారు.

**కింగ్ పిన్ ఎవరు ?** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు భద్రత పెంచాల్సి ఉందా? కాకినాడకు వెళ్తానన్న పవన్ ను అడ్డుకున్నదెవరు? పవన్ పర్యటనతో వెలుగులోకి వచ్చిన ఆ కింగ్ పిన్ ఎవరు? అన్ని కోట్లు గోల్ మాల్ జరుగుతుంటే అధికారులు ఇన్ని రోజులు ఏం చేశారు? ఈ ప్రశ్నలే ప్రస్తుతం ఏపీలో వినిపిస్తున్నాయి. కాకినాడ పోర్ట్ ఆధారంగా కోట్ల విలువైన రేషన్ బియ్యం సరఫరాను ఇటీవల కాకినాడ కలెక్టర్ అడ్డుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లు సంయుక్తంగా ఇచ్చిన ఆదేశాలతో కలెక్టర్ మెరుపుదాడులు నిర్వహించారు. భారీ స్థాయిలో రేషన్ ను పట్టుకున్నారు. అయితే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన ముగించుకొని నేరుగా కాకినాడ పోర్టుకు వచ్చారు. ఇక్కడే నేరుగా పవన్ కళ్యాణ్ కు అడ్డంకులు సృష్టించారట. ఈ మాటలన్నది ఎవరో కాదు పవన్. తాను పోర్టుకు వస్తానంటే అడుగడుగున అడ్డంకులు తగిలాయని, అలాగే కాకినాడ పోర్టు వద్దకు వచ్చినా కూడా.. సీజ్ చేసిన షిప్ వద్దకు తనను తీసుకెళ్లేందుకు కూడా అదే వ్యవహారం సాగిందని పవన్ అన్నారు. అంటే రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తూ.. కోట్లకు పడగలెత్తిన ఆ కింగ్ పిన్ హవా పోర్టులో ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యం ఆఫ్రికా వంటి దేశాల్లో ఏకంగా రూ. 70 లు పలుకుతుందట. ఇదే ఆసరాగా తీసుకున్న ముఠా పెద్ద ఎత్తున ఇక్కడ ఎన్నో ఏళ్లుగా రేషన్ సామ్రాజ్యాన్ని విస్తరించారని మంత్రి నాదెండ్ల మనోహర్ అంటున్నారు. కేవలం మూడేళ్లలో రూ. 45 వేల కోట్ల విలువైన రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగినట్లు మనోహర్ తేల్చారు. సీఎం చంద్రబాబు సైతం ఈ ఘటనపై స్పందించి, ఆ కింగ్ పిన్ ఎవరైనా వదిలేది లేదంటూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో పవన్ తన పర్యటనలో కొన్ని కీలక కామెంట్స్ చేశారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తున్నారు. రేపు స్మగ్లర్లు ఇంతటితో ఆగుతారా.. డబ్బులను కక్కుర్తి పడి ఉగ్రవాదులను తీసుకువస్తారుగా అంటూ అధికారులను ప్రశ్నించారు. ఇప్పుడు అసలు సంగతి ఏమిటంటే.. ఆ కింగ్ పిన్ ఎవరనేది ప్రశ్న. ఏకంగా పవన్ అడ్డుకునే స్థాయిలో ఆ కింగ్ పిన్ తెర వెనుక ఉన్నాడంటే.. అతని సామ్రాజ్యం కాకినాడ పోర్టులో పెద్దగా విస్తరించిందని కూడా చర్చలు సాగుతున్నాయి. పవన్ పర్యటనతోనే కాకినాడ పోర్టు వార్తల్లో రావడం, కోట్లలో స్మగ్లింగ్ బయటపడడంతో పవన్ కు భద్రత పెంచాలని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు. దేశ భద్రతకు సంబంధించిన అంశంగా కేంద్రం సైతం భావించి, అసలు పోర్టులో ఏం జరుగుతుందనే విషయాలను ఆరా తీసినట్లు సమాచారం. రేషన్ మాఫియా వెనుక ఎవరున్నారనే వేటలో పోలీసులు దృష్టి సారించినా, కింగ్ పిన్ ను కూకటివేళ్లతో కదిలించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా కింగ్ పిన్ చరిత్ర త్వరలోనే గుట్టురట్టు కావాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారు. అలాగే కాకినాడ పోర్టులో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ లకు ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.

## పాము కాటుతో బాలుడు మృతి

ఒంగోలు :
ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజు పల్లి గ్రామంలో సోమవారం రాత్రి సుమారు రెండు గంటల సమయంలో పాముకాటుకు గురయ్యాడు. ఇల్లు రేకుల షెడ్డు కావడంతో పై రేకుల్లో నుంచి మంచం పై నిద్రిస్తున్న బాలుడిపై పడి కాటు వేసిందని తల్లి తెలిపింది. బాలుడిని హుటాహుటిన గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాత్రి సుమారు మూడు గంటలకు ప్రభుత్వ వైద్యశాలలో బాలుడు మృతి చెందాడు.

## దుఃఖానికి కారణం అవిద్య


● డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే



మద్దికెర, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): పెరవలిలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు. దుఃఖానికి కారణం అవిద్య అని, ఆ అవిద్యను దూరం చేసి, శాశ్వతమైన ఆనందాన్ని కలిగించేది బ్రహ్మ విద్య అని, అటువంటి బ్రహ్మ విద్య సాంప్రదాయానికి మూలం భారతదేశమని, ఇటువంటి చరిత్ర కలిగిన ఈ దేశంలో పుట్టడం మన పూర్వజన్మ సుకృతమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మద్దికెర మండలం, పెరవలి గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం డాక్టర్ ఎస్. దేవి దయానంద సింగ్ చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించినది. తదనంతరం భజన మండలి అధ్యక్షులు, మాజీ సర్పంచ్ వెంకట రామ వర్మ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రబ్బా వీరయ్య, ప్రధానార్చకులు కొమందూరి రంగనాథా చార్యులు, స్థానిక భక్త బృందం సభ్యులు పారా రామచంద్ర ప్రసాద్, పురుషోత్తమ చౌదరి, ధర్మ ప్రసార ప్రముఖ్ డి. హనుమంతరావు రామలింగారెడ్డి, సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

రబి పంట నమోదు పంటల భీమా చేసుకోండి
ఏవో పవన్ కుమార్



వెలుగోడు, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): వెలుగోడు మండలం వెలుగోడు జమ్మినగర్ తాండ నందు ఏవో పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలు రైతులు ఖచ్చితంగా పంట నమోదు చేసుకోవాలని, రబి పంటలకు పంట బీమా ప్రీమియం చెల్లించి ప్రతి రైతు పంట బీమాత రక్షణ పొందాలని తెలిపారు. అకాల వర్షాలు, తుఫాను ప్రభావం వలన రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కూతకోసిన వరి దిగుబడులు సురక్షిత ప్రాంతానికి తరలించుకోవాలని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో మినుము పంటను,పంట కోత చేసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలోఏఈఓ అంజిత్ కుమార్ రెడ్డి వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగమణి రామకృష్ణ, ఏఐసి భీమా ఏజెంట్ మధుమోహన్ పలువురు రైతులు పాల్గొన్నారు.

## పాములపాడులో ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



పాములపాడు, డిసెంబర్ 3 (రిపబ్లిక్ న్యూస్): పాములపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఉన్న భవిత పాఠశాలలో, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు అధ్యక్షత వహించిన మండల విద్యాధికారిణి-2 సుభాషిణిదేవి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు ఏ విషయములో కూడా సాధారణ విద్యార్థులకు తక్కువ కాదని వారిలోని ప్రతిభాపాటవాలకు సరియైన తర్ఫీదు నిచ్చి, గుర్తించేట్టుగా చేయవచ్చని తెలిన్నారు. వీరిని సాధారణ విద్యార్థులతో కలిపి సమ్మిళిత విద్యను ప్రభుత్వము అందిస్తుందని ఈ అవకాశాన్ని దివ్యాంగ విద్యార్థులందరు అవకాశమున్నమేరకు ఉపయోగించుకోవాలని ఆమె విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు చదువు ఒక ఆయుధము లాంటిదని కాబట్టి ప్రతి ఒక్కరు వారి అవకాశము మేరకు చదువు కోవాలన్నారు. ఈ సంధర్భంగా నిర్వంచిన ఆటల పోటీల్లో గెలుపొందిన, విద్యార్థులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి బహుమతులను ఎంఈఓ మరియు ఉపాధ్యాయుల చేత పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమములో జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు స్వామిశేఖర్, శ్రీనివాసులు, సాయిరాం, రాంప్రసాద్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజశేఖర్, రవీంద్రనాధనాయుడు, రామక్రిష్ణుడు, రాజశేఖర్, రంగా రెడ్డి, మధుమోహన్, సిఆర్పీలు- మల్లికార్జున, రామలింగ నాయుడు, దేవకరుణా, భవిత ఉపాధ్యాయులు రామమూర్తి,షంషుద్దీన్, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మిట్నాల ఏపీ మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ



నంద్యాల ప్రతినిధి, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల మండలం మిట్నాల ఏపీ మోడల్ స్కూల్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ భవిష్యత్తులో ఏ కోర్సు చేయాలనుకుంటున్నారు, ఆదర్శ పాఠశాలలో ఎలాంటి విద్యాబోధన అందిస్తున్నారు, ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఇస్తున్నారా తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టాయిలెట్లు బాగున్నాయా... రన్నింగ్ వాటర్ వస్తుందా తదితర విషయాలను అడిగి తెలుసుకుంటూ పరిశీలించారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల ఉ



త్తీర్ణత శాతం, విద్యార్థుల హాజరు సంబంధిత రికార్డులను కలెక్టర్ పరిశీలిస్తూ సంబంధిత వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను, స్టోర్ రూంను తనిఖీ చేశారు. మిట్నాలలో నూతనంగా నిర్మిస్తోన్న మోడల్ స్కూల్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి



చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో తరగతి గదులతో పాటు వంటశాల, టాయిలెట్లు, పరిసర ప్రాంతాలను కూడ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు.

## నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 1000 మంది దివ్యాంగులకు నూతన దుస్తుల పంపిణీ

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం
కుట్టు మిషన్లు,చక్రాల కుర్చీలు,వినికిడి యంత్రాలు, చంక కర్రల పంపిణీ
దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు
ప్రత్యేక పాఠశాలల బాలలకు 300 నిత్యావసర వస్తువుల కిట్ల పంపిణీ
దీర్ఘకాలిక జబ్బుల దివ్యాంగులకు నెలవారీ మందులు, ఐఎంఏ ఉచిత ఆరోగ్య కార్డులు పంపిణీ



నంద్యాల, డిసెంబర్ 3 (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక ఎన్టీఆర్ పురపాలక టౌన్ హాల్ నందు మంగళవారం నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, ఐఎంఏ నంద్యాల,లయన్స్ క్లబ్ నంద్యాల సహకారంతో భారీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ ఎం.పీ.వి. రమణయ్యల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 1000 మంది దివ్యాంగులు నంద్యాల జిల్లా పలు ప్రాంతాల నుండి, వర్షాలు పడుతున్నప్పటికీ,ఉత్సాహంతో వచ్చి పాల్గొన్నారు.

**ఐదు లక్షల రూపాయల విలువ చేసే సేవా కార్యక్రమాలు:** 1000 మందికి నూతన దుస్తుల,ఏడు కుట్టు మిషన్లు, చక్రాల కుర్చీలు మూడు,8 వినికిడి యంత్రాలు,15 చంక కర్రలు, 10 మంది దివ్యాంగ విద్యార్థులకు 1500 చొప్పున ఉపకార వేతనాలు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న 12 మంది దివ్యాంగులకు నెలవారి మందులు, నంద్యాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆరు ప్రత్యేక పాఠశాలల బాలలకు 300 నిత్యావసర వస్తువుల కిట్లు ,10 మందికి ఐఎంఏ ఉచిత ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్.ఎం. డి . ఫయాజ్ ,రామకృష్ణ విద్యా సంస్థలు చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ మౌలాలి రెడ్డి,ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి నాగ మహేష్,ప్రముఖ వైద్యులు సహదేవుడు, నాగమణి,నర్మద,మాధవి, అరుణకుమారి,డాక్టర్ రవి కృష్ణ సతీమణి సునంద పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ దివ్యాంగుల సేవే దివ్య మానవ సేవగా భావించాలని, మానవసేవే మాధవ సేవ అని , దివ్యాంగుల పట్ల జాలి పడడం కాకుండా వారు ఆత్మవిశ్వాసంతో స్వశక్తితో పైకి రావడానికి సమాజం తన వంతు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగులు నిరుత్సాహపడకుండా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని కోరారు. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గత రెండు దశాబ్దాలకు పైగా నంద్యాల ప్రాంత దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందించారు.

**దివ్యాంగుల సంక్షేమ సంఘం నివేదిక:** నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు సుబ్బారెడ్డి,కోఆర్డినేటర్ ఎంపీ వి రమణయ్య, రామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం 365 రోజులు దివ్యాంగులకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ నిర్వహణకు సహకరించిన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వర్ధన్ సందర్భంగా పలు ఉపకరణాలు అందజేస్తున్నామని, ప్రతినెల దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే దివ్యాంగులకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి, దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.ప్రభుత్వం ద్వారా అందవలసిన సహాయ సహకారాలు అందుకోవడానికి అవసరమైన సలహాలు సూచనలు కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.


**సేవా కార్యక్రమాలకుసహకరించిన దాతలు:** డాక్టర్ పెద్దిరెడ్డి వెంకటగిరి రెడ్డి, డాక్టర్ మధుసూదనరావు, వెదుర్ల రామచంద్రరావు,డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ కల్పన, డాక్టర్ రాజేశ్ రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, భవనాసి వాసు, నాగ మహేష్ ,డాక్టర్ పనీల్, వర్ధన్ శెట్టి రాజారాం, డాక్టర్ నర్మద, లాలి స్వామి, తోట శ్రీనివాస్ ,రామన్న, పోసిన సుబ్బారావు, రవి ప్రకాశ్, సిరిగిరి రమేష్, డాక్టర్ శాలేశ్వర్ రెడ్డి, డాక్టర్ వినోద్, వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిల్ కుమార్ ,డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి, మహేశ్వరరెడ్డి ,డాక్టర్ విజయబాబు, డాక్టర్ పాండురంగారావు, కొమ్మె చంద్రశేఖర్ , కొమ్మె వేణుమాధవ్ ,శ్రీకాంత్, పబ్బు తులసి కృష్ణ, డాక్టర్ భార్గవరెడ్డి , సింధూరి ఆసుపత్రి డాక్టర్ మధుసూదన్ రెడ్డి ,డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, ఉదయానంద ఆసుపత్రి డాక్టర్ భార్గవరెడ్డి, కృష్ణమోహన్, మలేపాటి రాజశేఖర్, స్వామి రెడ్డి ,డాక్టర్ సోమశేఖర్ రెడ్డి,డాక్టర్ జగన్మోహన్ రెడ్డి ,డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ పెసల అశోక్ కుమార్, డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, డాక్టర్ మహమ్మద్ రఫీ. రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ క్యాడెట్ల ప్రశంసనీయమైన సేవలు కార్యక్రమ నిర్వహణలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ సేవలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి.

**మధ్యాహ్న భోజన వితరణ:** ఓంకార క్షేత్రంలోని శ్రీ కాశి నాయన ఆశ్రమం తరపున దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు.

**ఆత్మీయ సత్కారాలు:** కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను, దాతలను నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం తరఫున శాలువా జ్ఞాపికలతో ఆత్మీయ సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చంద్రమోహన్ ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, కూరా ప్రసాద్, జోన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి,దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి చలపతి, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు,రామకృష్ణ,వెంకటరావు , హనీఫ్ ఖాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షిత మంచినీటి ట్యాంకుకు మరమ్మత్తులు

బండి ఆత్మకూరు, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో రక్షిత మంచి నీటి ట్యాంకుకు మరమ్మత్తు పనులు చేపట్టారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకుకు ఎలాంటి మరమ్మత్తులు చేయకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా పెచ్చులు ఊడటంతో ప్రమాదకరంగా తయారైందని గ్రామ సర్పంచ్ మన్నే జ్ఞానభరణం సూచన మేరకు అధికారులు మంగళవారం పనులు ప్రారంభించారు. దీంతో మూడు, నాలుగు రోజులపాటు గ్రామ మరమ్మత్తుల వల్ల గ్రామములో కొళాయిలకు నీళ్లు వచ్చే అవకాశం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలు నీటి సరఫరా విషయంలో సహకరించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.



## గ్రంథాలయం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతి




బండి ఆత్మకూరు, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): బండి ఆత్మకూరులో గ్రంథాలయం కార్యాలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని తహసిల్దార్ ధోని ఆల్ఫ్రెడ్‌కు విన్నవించారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో గ్రంథాలయ అధికారి మధు తహసిల్దార్ ను కలిసి గ్రంథాలయ నూతన కార్యాలయం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయాలని సూచించారు. ఈ విషయంపై తహసిల్దార్ సానుకూలంగా స్పందించినట్లు గ్రంధాల అధికారి తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుధాకర్ శర్మ, కార్యాలయ సిబ్బంది హుస్సేన్ శెట్టి తదితరులు ఉన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి



బండి ఆత్మకూరు, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): పదవ తరగతిలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయ సిబ్బంది కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులోని రికార్డులను పరిశీలించి పదవ తరగతి విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. చదువుతూనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన భవిత సెంటర్లో పాల్గొన్నారు. తర్వాత వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో బహుమతులు ప్రధానం చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారులు యశోద, మోహన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్, ఉపాధ్యాయ సిబ్బంది సహిత, విద్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రావుస్ కళాశాల విద్యార్థి న్యాయమూర్తిగా నియామకం



న్యాయమూర్తిని సన్మానించిన కళాశాల యాజమాన్యం



నంద్యాల, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్):రావుస్ కళాశాల పూర్వ విద్యార్థి న్యాయమూర్తిగా ఎన్నిక అవ్వడం జరిగింది. హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి నియామక పరీక్ష రాసి విజయం సాధించిన రావుస్ కళాశాల పూర్వ విద్యార్థి. రావుస్ జూనియర్ కళాశాల 2012-14 బ్యాచ్ సీఈసీ గ్రూప్‌కి చెందిన షేక్ ఖాజా రేహమాన్ గిద్దలూరు నివాసి. ఈ సందర్భంగా రావుస్ కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు, కళాశాల డైరెక్టర్ ఏ మోని చంద్ర లు కళాశాల పూర్వ విద్యార్థి అయిన షేక్ కాజా రెహమాన్ ను అభినందించడం జరిగినది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులు ఇంజనీర్లుగా, డాక్టర్లగా, చార్టెడ్ అకౌంటెంట్‌గా, సివిల్స్ పరీక్షలు కూడా రాసి ఐఏఎస్, ఐపీఎస్ లుగా సెలెక్ట్ కావడం జరిగిందని ఇప్పుడు రేహమాన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్త పరుస్తూ ఈరోజు నా జీవితంలో మర్చిపో లేని రోజు అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన కాజా రెహమాన్ మాట్లాడుతూ రావుస్ కళాశాల నందు సైన్స్ విద్యార్థులకే కాకుండా ఎం ఇ సి మరియు సిఈసి వారికి ప్రాధాన్యత ఇచ్చేవాడని తెలిపారు. హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించేవాడని తెలిపారు. కళాశాల నందు శిక్షణ ఇచ్చిన అధ్యాపకుల కృషితో నేను ఈరోజు ఈ స్థాయికి చేరానని తెలియజేస్తూ నన్ను సన్మానించిన చైర్మన్, డైరెక్టర్లకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రొద్ద సుంకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎర్రగూడూరులో అంబేద్కర్, గాంధీ విగ్రహాలను పునరుద్ధరించండి

● లేదంటే నష్టపరిహారం చెల్లించాలి ● జిల్లా కలెక్టర్, పాములపాడు డిటిలకు వినతి
● ప్రజా సంఘాల నాయకులు



పాములపాడు, డిసెంబర్ 3 (రిపబ్లిక్ న్యూస్): పాములపాడు మండలంలోని, ఎర్రగూడూరులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలను పి ఎస్ కే కంపెనీ నేషనల్ హైవే 340 సి రోడ్డు వెడల్పు చేసే పనులలో కాంట్రాక్టర్ పగులగొట్టినారనీ, కావున ఎర్రగూడూరులో మళ్లీ ఈ విగ్రహాలను తిరిగి పునరుద్ధరించాలని, లేదంటే నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల. సంజీవరాయుడు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ సమస్య మీద, పాములపాడు మండలం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ పఠాన్ బాబుకు ప్రజా సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు నల్లమల అబ్రహం, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు కలబండి.అంకన్న, రుద్రవరం టిడిపి నాయకులు ముద్రగడ. శ్రీనివాసరావు, ఇస్కాల టిడిపి నాయకులు ఎం.జాన్ బాబు, వేంపెంట సోషల్ వర్కర్లు నాగేశ్వర నాయక్, ఎన్.స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల పట్ల ప్రేమ దయ కలిగి ఉండాలి :ఎంపీడీవో



వెలుగోడు, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): వికలాంగుల పట్ల ప్రేమ దయాగుణం కలిగి ఉండాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. వెలుగోడు పట్టణ వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ అబ్దుల్ రఉఫ్ కార్యదర్శులు ఇంతియాజ్ రహంతుల్లా లో ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం, ఆత్మ గౌరవం, వికాసం హక్కుల సాదన,రాజ్యాది కారంలో భాగస్వామంలను నిర్దిష్ట లక్ష్యాలతో చిత్త సుద్దిగా వికలాంగుల అభివృద్ధి కొరకు, వారికి ఆత్మగౌరవం పెంపొందించేందుకు పాటుపడాలన్నారు. వికలాంగుల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా వికలాంగులకు సదరం సర్టిఫికేట్లు పెన్షన్ మ్యారేజ్ ఫండ్స్ ఇండ్ల స్తలాలు దివ్యాంగులకి అవసరమైన ఉపకరణాలు అనగా చంకలో కర్రలు , వీల్ చైర్, ట్రై సైకిల్, చార్జింగ్ బండి, హియరింగ్ మిషన్లు, బ్లైండ్ కేన్స్ , బస్‌పాస్, రైల్వే పాస్, యుఐడి కార్డు తదితర వాటి కోసం కృషి చేశామన్నారు.వికలాంగుల పై దాడులు అత్యాచారాలు జరిగినప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకోని వెళ్ళి వారికీ న్యాయం జరిగే విధంగా పోరాటం చేస్తున్నామన్నారు . టిడిపి నాయకులు పి.హిదాయత్ అలీ ఖాన్ మాట్లాడుతూ అర్హులైన వికలాంగుల అందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు అయ్యేల కృషి చేస్తామన్నారు.అదేవిధంగా వెలుగోడు పట్టణ భవిత కార్యాలయం స్పెషల్ ఉపాధ్యాయులు పివిడిఎస్ రావు . కుద్రతుల్లా .రాజకుమారి.శేషన్నల ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు బ్రహ్మం నాయక్, నాగ బ్రహ్మయ్యలు పాల్గొని వికలాంగులకు సందేశం ఇచ్చారు.అనంతరం విద్యార్థులచే పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అమీర్ హంజ , కే, ఖలీల్ ఖాన్ , మోమిన్ రసూల్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు , డాక్టర్ జాకీర్ హుస్సేన్ , సయ్యద్ బాష వాదం నగసేసుల వికలాంగుల సంఘం నాయకులు సామన్న, నాగరాజు , నురుల్లమీన్,శాంతా కుమారి ,రవికుమార్, రవిగౌడ్, మాలి, సుంకమ్మ, ఎల్లమ్మ, ముక్తరున్, విష్ణు వర్ధాన్, శివమ్మ నాగన్న పాల్గొనడం జరిగింది.

## పంటల భీమా సద్వినియోగం చేసుకొండి

-వ్యవసాయ అధికారి స్వాతి



బండి ఆత్మకూరు, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): రైతులు రబీలో సాగుచేసిన పంటల బీమా ప్రీమియం గడువులోగా చెల్లించి ప్రీమియం పొందాలని మండల వ్యవసాయ అధికారిని స్వాతి సూచించారు. మంగళవారం మండలంలోని ఏ.కోడూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె స్థానిక రైతు సలహా కేంద్రంలో రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పంటల భీమా ప్రీమియమును ఎన్సీఐపీ పోర్టల్ లో సిఎస్సి సెంటర్ నందు వ్యక్తిగతంగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. వరి పైరు సాగుచేసిన రైతులు డిసెంబర్ 30 లోపల ప్రీమియం చెల్లించాలన్నారు. అలాగే జొన్న, మినుము సాగుచేసిన రైతులు ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాలని ఆమె కోరారు. అలాగే వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు పశువైద్యాధికారిని గౌసియా బేగం ఈ కార్యక్రమంలో పాల్గొని పశుగణన సర్వేకి రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పశుగ్రాస పెంపకంపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.





## నూతన ఇసుక డిపోను ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్

నంద్యాల, డిసెంబర్ 3, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల స్థానిక అయ్యలూరు మెట్ట దగ్గర షేక్ అబ్దుల్ కుదుస్ ఏర్పాటుచేసిన ఇసుక డిపో, స్టాక్ యాడ్‌ను టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫయాజ్ మాట్లాడుతు అయ్యలూరు మెట్ట దగ్గర ఇసుక స్టాక్ యాడ్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉన్నాయి. నంద్యాల చుట్టుపక్కల ప్రజలు నంద్యాల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉదయం 6 నుంచి సాయంత్రం 7 వరకు ఇసుక డిపో తెరిచి ఉంటుందని ఒక ఆధార్ కార్డు పై రోజుకు 20 టన్నులు మాత్రమే ఇసుకను కొనుగోలు చేయడానికి అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించండి

● జిల్లా కలెక్టర్ రాజకుమారి



నంద్యాల ప్రతినిధి, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యాబోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విద్యార్థుల పాస్ పర్సంటేజ్ పై జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ దాదాపు 140 జూనియర్ కళాశాలలో చదివే 5,861 మంది విద్యార్థులు ఈ ఏడాది త్రైమాసిక పరీక్షల్లో కేవలం 2,252 మంది విద్యార్థులకే పాస్ పర్సెంటేజ్ రావడం బాధాకరమని విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యాబోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. పిల్లలకు కనీసం పాస్ మార్కులు కూడా తెప్పించలేని స్థితిలో అధ్యాపకులు ఉన్నారని కలెక్టర్ ప్రశ్నించారు. 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్లో రన్నర్స్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పిల్లలను భవిష్యత్తులో ఎలా తీర్చిదిద్దాలన్న సానుకూల దృక్పథంతో లెక్చరర్లు ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక ఓరియంటేషన్ ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పదవ తరగతిలో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లో 50 శాతం మార్కులకే పరిమితమవుతున్నారని... అందుకు గల కారణాలను విశ్లేషించి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. విద్యార్థులు కళాశాలలకు వచ్చేరీతిలో ఆసక్తి కల్పించేలా బోధన జరగాలన్నారు. విద్యార్థులు తక్కువ శాతంలో పాస్ మార్కులు వస్తే రాష్ట్రంలో జిల్లా ప్రగతి కుంటుపడుతోందని... ఇందుకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు ఉత్తమ విద్యా బోధన అందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ప్రిన్సిపాల్ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డివిఈఓ సునీత, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

